

4

విముక్తిలో చురుకైన పాత్ర పోషించిన విశ్వవిద్యాలయాలు అభ్యున్నతిలో సైతం తోడ్పడాలి

ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
నల్లగొండ సూర్యాపేట యాదాద్రి

బుధవారం | 30 జులై, 2025 | పేజీలు : 06

# బిసి రిజర్వేషన్ బిల్లుకు ఆర్ఎస్ఎస్ అడ్డు



**శాసనసభలో మద్దతు తెలిపినా బిజెపి పార్లమెంటులో అడ్డుకోవడం ఏంటి?**

**42 శాతం బిసి రిజర్వేషన్ బిల్లు పార్లమెంటు తొమ్మిదవ షెడ్యూల్లో పెట్టించి రాష్ట్ర బిజెపి ఎంపిలు చిత్తశుద్ధి చాటుకోవాలి**

**రెండు రోజుల్లోనే ఆపరేషన్ సిందూర్‌ను ఎందుకు నిలిపివేశారు**

**ఈ దేశానికి కమ్యూనిస్టులు అవసరమని ప్రజలు గుర్తిస్తున్నారు**

**మీడియా సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, సిపిఐ శాసనసభ పక్ష నేత కూనంనేని సాంబశివరావు**

**ప్రజాపక్షం/యాదాద్రి భువనగిరి :** 42 శాతం బీసీ రిజర్వేషన్ బిల్లుకు ఆర్ఎస్ఎస్ శక్తులు అడ్డ పడుతున్నాయని సిపిఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, సిపిఐ శాసనసభక్షనేత కూనంనేని సాంబశివరావు ఆరోపించారు. మంగళవారం యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలంలో సిపిఐ 4వ జిల్లా మహాసభకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆ పార్టీ జాతీయ నాయకులు పల్లా వెంకట్‌రెడ్డితో కలిసి పాల్గొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సాహసోపేతమైన నిర్ణయాన్ని తీసుకొని చాలా ధైర్యవంతంగా 42 శాతం బీసీ రిజర్వేషన్ బిల్లును శాసనసభలో ప్రవేశపెట్టగా బిజెపికి చెందిన ఎమ్మెల్యేలు మద్దతు ఇచ్చారని తెలిపారు. కానీ ఆ బిల్లును పార్లమెంటులో 9వ షెడ్యూల్లో ప్రవేశపెట్టడానికి కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఎందుకు ముందుకు రావడంలేదని ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్రం నుంచి గెలిచిన ఎనిమిది మంది బిజెపి పార్లమెంటు సభ్యులు 42 శాతం రిజర్వేషన్ బీసీ బిల్లును తొమ్మిదవ షెడ్యూల్లో చేర్చడానికి బిజెపి అధిష్టానం పై ఒత్తిడి తీసుకువచ్చి తమ చిత్తశుద్ధిని చాటుకోవాలని అన్నారు. 50 శాతానికి మించి రిజర్వేషన్లు ఉండకూడదన్న సుప్రీంకోర్టు తీర్పును సాకుగా చూపిస్తున్న కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఈ బీసీలకు 10 శాతం రిజర్వేషన్ అమలుకు ఆ తీర్పు అడ్డురాలేదా అని ప్రశ్నించారు. 42 శాతం బీసీల రిజర్వేషన్లు 10 శాతం ముస్లింలను చేర్చారని బిజెపి పేర్కొనడం చాలా దుర్మార్గమని అన్నారు. ముస్లింలు ఈ దేశ ప్రజలు కాదా? వారు భారతీయులు కాదా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. బిజెపికి కేవలం అధికారమే కావాలా? దేశం సుభిక్షంగా ఉండాలన్నది స్పష్టత ఇవ్వాలన్నారు. ఈ దేశం సుభిక్షంగా ఉండాలంటే సర్వ మతాలు, దేశంలో ఉన్న సర్వ వర్గాలు సంతోషంగా ఉండే విధంగా బిజెపి ప్రభుత్వ పరిపాలన విధానాలు ఉండాలన్నారు. అలా కాకుండా దేశంలో జై శ్రీరామ్ అంటూ అంతర్జాతీయంగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కు తొత్తుగా వ్యవహరించడం సరికాదన్నారు. అమెరికా (మిగతా2)లో

# అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డులు




**పెద్దవూరలో నూతన రేషన్ కార్డుల పంపిణీలో పాల్గొన్న మంత్రులు ఉత్తమ్, లక్ష్మణ్ కుమార్**

**ప్రజాపక్షం/హాలియా(పెద్దవూర) :** రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు ఇస్తున్నామని రాష్ట్ర పౌరసరఫరాలు, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన జిల్లా ఇన్చార్జి మంత్రి, రాష్ట్ర ఎస్‌సి,ఎస్‌టి, మైనార్టీ శాఖల మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తో కలిసి పెద్దవూర మండల కేంద్రంలోనిర్వహించిన నూతన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ ప్రభుత్వం ఏర్పడినప్పుడు రాష్ట్రంలో 89 లక్షల రేషన్ కార్డులు ఉండేవని, రెండు కోట్ల 80 లక్షల మంది సభ్యులు ఉండేవారని, ఆ సంఖ్య ఇప్పుడు 97 లక్షలకు పెరిగిందని, మూడు కోట్ల 15 లక్షల మంది లబ్ధిదారులు ఉన్నారని తెలిపారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టు గత 3 సార్లు గరిష్ట స్థాయికి నీరు చేరడం అదృష్టం అని అన్నారు.రాష్ట్ర ఎస్‌సి,ఎస్‌టి, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి, జిల్లా ఇన్చార్జి మంత్రి ఆడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ ప్రపంచంలో నాగార్జున్ సాగర్ ప్రాజెక్టు గొప్పదనాన్ని మర్చిపోలేమని అన్నారు. నల్లగొండ జిల్లాలో నాలుగు లక్షల 65398 రేషన్ కార్డులు ఉన్నాయని, కొత్తగా 62155 ఇచ్చామని, నాగార్జునసాగర్ నియోజక వర్గంలో కొత్తగా 10747 కార్డులు ఇవ్వడం సంతోషమన్నారు. నాగార్జునసాగర్ శాసనసభ్యులు కుందూరు జయవీర్ రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వం పది సంవత్సరాల్లో ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదన్నారు. రాష్ట్ర పౌరసరఫరాల శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ డిఎస్ చౌహాన్, జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎమ్మెల్సీ శంకర్ నాయక్ మాజీ జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ లింగారెడ్డి, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్లు సత్యం, చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

## రేషన్ కార్డుల పంపిణీ దేశంలో ఒక చరిత్ర

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** అధికారంలోకి వచ్చిన రెండు సంవత్సరాల్లోనే పెద్ద మొత్తంలో లబ్ధిదారులకు నూతన రేషన్ కార్డులను పంపిణీ చేయడం దేశంలో ఒక చరిత్రనీ నీటిపారుదల పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి స్పష్టం చేశారు.కాంగ్రెస్ మండల కేంద్రలో నూతన ఆహార భద్రత కార్డుల పంపిణి కార్యక్రమానికి ఆయన (మిగతా2)లో



## సి.నారాయణరెడ్డి జయంతి వేడుకలు

**ప్రజాపక్షం/కోదాడ:** అక్షరశిల్పి, జ్ఞానపీఠ్ అవార్డు గ్రహిత, తెలుగు సాహిత్య రత్నం సినారే జయంతి వేడుకలను మంగళవారం కోదాడ పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా కోదాడ మండల విద్యాధికారి సలీంష రిఫ్ పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలుగు సాహిత్యానికి సినారే చేసిన కృషిని కొనియా డారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యా యుడు మార్కేండేయ, ఉపాధ్యాయులు వీరబ్రహ్మ చారి, జానకిరామ్ పాల్గొన్నారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఒకరికి ఒకరోజు జైలు శిక్ష

### ఏడుగురికి జరిమానా




**ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్:** మద్యం సేవించి వాహ నాలు నడపరాదని సూర్యాపేట ట్రాఫిక్ ఎస్ఐ సాయిరాం హెచ్చరించారు. జిల్లా ఎస్పి కె.నర్సింహ అదేశాల మేరకు సూర్యాపేట పట్టణంలో వాహనాల తనిఖీలు చేపట్టారు. డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో మద్యం సేవించి డ్రైవింగ్ చేస్తూ ఎనిమిది మంది పట్టు బడినట్లు ఎస్ఐ తెలిపారు. పట్టుబడిన వారిని మంగళ వారం కోర్టులో హాజరుపర్చగా సూర్యాపేట ద్వితీయ శ్రేణి న్యాయమూర్తి బివి రమణ ఒక్కరికి ఒకరోజు జైలు శిక్ష, రెండువేల జరిమాన, మద్యం సేవించి వాహ నాలు నడిపిన మిగతా ఏడుగురికి కలిపి 6500 జరి మాన విధిస్తూ జడ్జి తీర్పు చెప్పినట్లు ట్రాఫిక్ ఎస్ఐ తెలి పారు. ఇప్పటికైనా ప్రజలు మద్యం తాగి వాహనలు నడపవద్దని, పట్టుబడితే చలనాలు విధించడంతో పాటు కోర్టులో హాజరుపర్చనున్నట్లు తెలిపారు.

## మౌలిక వసతుల కల్పనే ధ్యేయం

**ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్:** విద్యార్థులకు సాంకే తిక విద్యను అందించడంలో భాగంగా మౌలిక వస తులు కల్పించాలనే ఉద్దేశ్యంతో పాఠశాలలో కంప్యూ టర్ గదిలో అభ్యసన కోసం బోధన సామాగ్రి, కూర్చీలు, పర్నిచర్ లను పట్టణంలోని త్రిశక్తి మహిళ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకురాలు పస్పర్తి జ్యోతికృష్ణ మూర్తి మంగళవారం శ్రీ సరస్వతి విద్యానిలయం యాజమాన్యం గుండా రమేష్, పర్వతం శ్రీధర్, నరేం దర్ లకు అందజేశారు. దాతలు ముందుకు పాఠశాల అభివృద్ధికి తోడ్పడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కర్పూరం కవిత, సంస్థ సభ్యులు గుండా సుధామాధురి, తెడ్ల రాధిక, యాదగిరి, విజయకుమార్, లావణ్య పాల్గొన్నారు.



## ఓంకార్ శతజయంతి ఉత్సవాలను జయప్రదం చేయాలి




**ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్:** కామ్రెడ్ ఓంకార్ శత జయంతి ఉత్సవాలను జయప్రదం చేయాలని సిఐ టియు రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వరికుప్పల వెంకన్న తెలిపారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ బిల్డింగ్‌లో జిల్లా కమిటి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ముందుగా కేరళ మాజీ ముఖ్యమంత్రి అచ్యుతానం దన్, పార్టీ సభ్యురాలు ఏపూరి పిచ్చమ్మ లకు రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సిఐటియు వ్యవస్థాపక నాయకులు అమరజీవి కామ్రెడ్ మద్దికాయల ఓంకార్ శతజ యంతి వార్షికోత్సవాలు ప్రారంభమైన సందర్భంగా మన జిల్లాలో ఆగస్టు 8వ తేదీన రైతాంగ సమస్యలు, భూపోరాటాలపై ఓంకార్ పాత్ర అంశంపై రౌండ్‌టే బుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శతజ యంతి వార్షికోత్సవాలను సంవత్సరం పాటు నెలకు ఒక కార్యక్రమం చొప్పున పార్టీ జిల్లా కమిటి తీసు కుని పనిచేయాలని కోరారు. కామ్రెడ్‌ల విగ్రహలను ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్‌కె నజీర్, నక్కా శ్రీనివాస్, నలుగూరి రమేష్, వేములపెద్ద నర్సయ్య, ఉమేష్, సోమగాని వెంకన్న పాల్గొన్నారు.

## బిసి రిజర్వేషన్ బిల్లుకు ఆర్ఎస్ఎస్ అడ్డు

(మొదటి పేజీ తరువాయి)
అధ్యక్షుడు ట్రంప్ చెప్పినట్లుగా భారత ప్రధాని మోడీ ఇజ్రాయిల్ కు మద్దతు ఇస్తున్నాడని విమర్శించారు. గాజాలో చిన్నారులు ఆకలి కేకలతో విలపిస్తున్న అహా కారాలు, తిండి దొరకక చనిపోతున్న వార్త కథ నాలు చూస్తుంటే గుండె ద్రవిస్తుందని పేర్కొన్నారు. మానవజాతి నివ్వరపోయే విధంగా, అమానవీ యంగా జరుగుతున్న దాడి అన్యాయమని చెప్పలేని దౌర్భాగ్య స్థితిలో మోడీ ఉన్నాడని దుయ్యబట్టారు. పహాల్గాం దాడి తర్వాత పాకిస్తాన్ సంగతి చూస్తానని బీరాలు పలికిన ప్రధాని మోడీ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చెపితే ఎందుకు ఆపరేషన్ సింధూర్ ను అర్ధాంతరంగా రెండు రోజుల్లోనే నిలిపివేశాడని నిల దీశారు. దేశంలో ఏ చిన్న సంఘటన జరిగిన దానికి మతం రంగు పులిమి రాజకీయ పబ్బం గడుపుకోవ డమే తప్పా ప్రజలకు మేలు చేయాలన్నది బిజెపికి లేదన్నారు. బిజెపి మత రాజకీయాలతో కొనసాగి స్తున్న ఉన్మాదం, తీవ్రవాదం పేరిట ప్రశ్నించే వారిని లేకుండా చేయాలని ఆపరేషన్ కగార్ పేరిట కొనసా గిస్తున్న మావోయిస్టుల ఏరివేత, మతం సెంటి మెంటు మాటున ప్రజలను మభ్యపరిచి దేశ సంప దను అంబానీ ఆదాని లాంటి పెట్టుబడిదారులకు దోచిపెట్టడానికి ఈ దేశ మూలవాసులపై జరుగు తున్న దాడుల నేపథ్యంలో ప్రజలు ఈ దేశానికి కమ్యూనిస్టులు అవసరమన్న విషయాన్ని గుర్తించా రని తెలిపారు. ఈ దేశానికి కమ్యూనిస్టులు అవసర మని ప్రజలు గుర్తిస్తున్న క్రమంలో ఎర్రజెండాలు అన్ని ఏకం కావలసిన సమయం ఆసన్నమైందని పిలుపునిచ్చారు. మీడియా సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి గోదా శ్రీరాములు, సహాయ కార్యదర్శులు యానాల దామోదర్ రెడ్డి, బొలగాని సత్యనారా యణ, జిల్లా కార్యవర్గ సభ్యులు బోడ సుదర్శన్, బండి జంగమ్మ, కొల్లూరి రాజయ్య, కళ్యెం కృష్ణ, ఎం.డి.ఇమ్రాన్, ఏశాల అశోక్, ఉప్పల ముత్యాలు, చెడే చంద్రయ్య, బచ్చనగోని గాలయ్య, చెక్క వెంక టేష్, కుసుమాని హరిచంద్ర తదితరులు ఉన్నారు.

## అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డులు

(మొదటి పేజీ తరువాయి)
ముఖ్య అతిధిగా, జిల్లా ఇన్చార్జి మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డిలతో కలిసి లబ్ధిదారులకు రేషన్ కార్డుల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్థానిక బాలాజీ ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ తక్కువ సమయంలో పెద్ద మొత్తంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు హాజరై ప్రజలు బ్రహ్మరథం పట్టేలా సభను ఏర్పాటు చేసిన కుంభం ఎమ్మెల్యే కుంభ అనిల్ కుమార్ రెడ్డి పనితీరును ప్రశంసిస్తూ విజయవంతం చేసినందుకు ధన్యవాదములు తెలి పారు.మూడున్నర సంవత్సరాలో భువనగిరి నియోజ కవర్గన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసే సమర్థత గల ఎమ్మెల్యేఅని కొనియాడారు. అన్ని విధాలుగా పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. భూసేకరణ తొందరగా పూర్తయితే పునాదిగాని కాల్వను పూర్తి చేద్దామని భరోసా ఇచ్చారు.ఆలేరులో గంధ మల్ల ప్రాజెక్టుకు 550 కోట్లతో శంకుస్థాపన చేయడం జరిగిందనీ తెలిపారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలో ఇరిగేషన్ శాఖలో ప్రతి పనిని పూర్తి చేస్తా మని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ హనుమంతరావు కోదాడకు చెందిన వ్యక్తినీ ప్రజా సమస్యల పట్ల పరి ష్కారం పట్ల చిత్తశుద్ధితో పనిచేసే భూ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించి అన్ని శాఖలను సమ న్వయం చేస్తూ పరిపాలన దక్షుడిగా పేరు సంపాది స్తున్న వ్యక్తి అని కొనియాడారు. 10 ఏళ్ల లో బి ఆర్ ఎస్ ప్రభుత్వం ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదన్నారు. భువనగిరి నియోజకవర్గంలో 41198 మందికి కొ త్తగా రేషన్ కార్డులు మంజూరు చేసినట్లు తెలిపారు.

### గేట్లను తెరవడం సంతోషం: మంత్రి అడ్లూరి

ప్రపంచంలోనే అత్యంత విశిష్టత కలిగిన భారీ ప్రాజెక్టు నాగ సాగర్ గేట్లను తమ చేతుల మీదుగా తెరవడం జీవితంలో మరపురాని సంఘటనని జిల్లా ఇన్చార్జి మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ సంతోషం వ్యక్తం చేశారు.పోచంపల్లిలో ఆహార భద్రత కార్డులను అందజేయడం చాలా తృప్తిగా ఉందని గత ప్రభుత్వం పది సంవత్సరాలలో ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదనీ విమర్శించారు. ఈ కార్యక్రమంలో డిఎస్ చౌహాన్ రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమీషనర్ అద నపు జిల్లా కలెక్టర్ భాస్కరరావు, ఆర్డీవో శేఖర్ రెడ్డి తా సిల్దారు శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ అంజన్ రెడ్డి, ఎండిఓ భాస్కర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తడక వెంకటేశ్వర్లు, డిసిసి ఉపాధ్యక్షులు కళ్లెం రాఘ వరెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు పాక మల్లేష్ యాద వ్, టౌన్ అధ్యక్షులు భారత లవకుమార్ పాల్గొన్నారు.




## గురుకుల కళాశాల మొదటి సంవత్సరం ఇంటర్మీడియట్ స్పాట్ అడ్మిషన్

**ప్రజాపక్షం/చివ్వెంల:** చివ్వెంలలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో మొదటి సంవత్సరం ఇంటర్మిడియట్ స్పాట్ అడ్మిషన్ కలవని, ఎంపిసి, బైపీసిలో పరిమిత ఖాళీలకు కార్యదర్శి అదేశాల మేరకు ఈనెల 31వ తేదీన స్పాట్ కౌన్సిలింగ్ నిర్వహించ నున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ వి.విద్యాసాగర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి 2025 పదవ తరగతిలో మొదటిసారి పాస్ అయినటువంటి విద్యార్థుల నుండి 31వ తేదీ రోజు తెలం గాణ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 1:00 గంటల వరకు అప్లికేషన్స్ స్వీకరించను న్నట్లు, మధ్యాహ్నం రెండు గంటల తర్వాత మెరిట్ ప్రకారం స్పాట్ అడ్మిషన్లు కౌన్సిలింగ్ నిర్వహించబడుతుందని తెలిపారు. అడ్మిషన్ల కోసం విద్యార్థుల ఒరిజనల్ కుల, ఆదాయ సర్టిఫికెట్లు, ఎస్ఎస్‌సి ఆన్‌లైన్ మెమో, టిసి, స్టడి కండక్టలతో పాటు ఆధార్, రేషన్‌కార్డులు జీరాక్స్ జత చేయాలని కోరారు. 79950 10665 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

## ఎంఎస్ఎంఇ పరిశ్రమల ఏర్పాటుకు ర్యాంప్ ద్వారా అవకాశాలు



**ప్రజాపక్షం/ రామన్నపేట:** కేంద్ర ప్రభుత్వం సూక్ష్మ ,చిన్న, మధ్య తరహా పరిశ్రమలను ప్రోత్సహించడానికి తీసుకొచ్చిన ర్యాంప్(రై సింగ్ అక్సలరేటింగ్ ఎంఎస్ఎంఈ ఫెర్మార్మెన్స్) ప్రాజెక్టు గురించి రామన్నపేట పంచాయతీ కార్యదర్శులకు మండల ఎంపీడీవో రాములు అధ్యక్షతన అవగాహన సదస్సును ఈడీసీ మేనేజర్ కుమ్మ రికుంట్ల రంజిత్‌కుమార్ నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్త పరి శ్రమలకు, ఉన్న అవకాశాలను, ప్రభుత్వ పథకాలను తెలుసుకోని సద్వినియోగం చేసుకోని ప్రతి ఒక్కరు, మహిళలు, నిరుద్యోగులు పారిశ్రామిక వేత్తలుగా తయారు అవ్వాలన్నారు. అదేవిధంగా తెలంగాణ ప్రభుత్వం నిరుద్యోగుల కోసం ప్రతిష్టాత్మకంగా తీసు కొచ్చి డీట్ పోర్టర్ గురించి వివరించారు. గ్రామాల్లో ఉన్న నిరుద్యో గులు ప్రతి ఒక్కరు డీట్‌లో నమోదు చేసుకోని తద్వారా ఉద్యోగ అవ కాశాలు పొందాలని అన్నారు. కార్యక్రమంలో ఎంపీవో, మండల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## ఐరన్ గ్యాస్ స్టవ్ ప్రదానం



**ప్రజాపక్షం/ రామన్నపేట:** మండలంలోని మునిపంపుల ఉన్నత పాఠశాలకు మంగళవారం సేవాభారతి స్వచ్ఛంద సంస్థ ఆధ్వ ర్యంలో సంస్థ పోషకులు మన్నె పద్మారెడ్డి రెండు బర్నర్ గ్యాస్ స్టవ్ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు దొడ్డి స్వామి మాట్లాడుతూ పద్మారెడ్డి వంటి దాతలు పాఠశాల అభివృ ద్ధిలో భాగస్వాములవుతూ వంట చేయడంలో ఎదురవుతున్న ఇబ్బందులు గమనించి కోరగానే గ్యాస్ స్టవ్ అందించడం అభినం దనీయమన్నారు. ఈ సందర్భంగా మన్నె పద్మారెడ్డిని శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు మాజీ సర్పంచ్ కట్టా యాదయ్య, మిర్యాల శ్యాంసుందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## బిఇడి అభ్యర్థుల మహా పాదయాత్ర

**ప్రజాపక్షం/ రామన్నపేట:** స్కూల్ అసిస్టెంట్ పోస్టుల డైరెక్ట్ రిక్రూ ట్‌మెంట్ కోటాలో బీఈడీ అభ్యర్థులకు కేవలం 30శాతం ఇస్తూ ఎస్ జీటీలకు 70శాతం ప్రమోషన్లు ఇవ్వడాన్ని నిరసిస్తూ తమకు కనీసం 80శాతం తగ్గకుండా కోటా ఇవ్వాలని రాష్ట్ర బీఈడీ అభ్య ర్థుల సంఘం మహా పాదయాత్ర నిర్వహించనున్నట్లు తెలిపారు. పాదయాత్ర ఆగస్టు 3 నుంచి 7వరకు ఉంటుందని, యాదగిరిగుట్ట శ్రీలక్ష్మి నరసింహాస్వామి దేవాలయం నుంచి హైద్రాబాద్‌లోని ఎస్ సీఆర్టీ విద్యా కమీషన్ వరకు ఉంటుందని అన్నారు. కావునా రాష్ట్రం లోని అభ్యర్థులందరు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు.



## పరామర్శ, ఆర్థికసాయం

**ప్రజాపక్షం/మోటకొండూర్:** మోటకొండూర్ మండలంలోని కాటేపల్లిలో ఇటీవల మృతి చెందిన గందమల్ల గౌరమ్మ, కునూర్ దుర్గా ప్రసాద్‌ల కుటుంబ సభ్యులను కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, వైఎస్ఆర్ పౌండేషన్ అదినేత యెల్లంల సంజీవరెడ్డి పరామర్శించి ఒక్కొక్కరి కుటుంబ సభ్యులకు రూ.5 వేలు చోప్పున ఆర్థిక సహయం అందించారు. ఈ కార్యక్రమంలో కాటేపల్లి కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షులు పడమటి రాంరెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గంధమల్ల నరసింహ, పచ్చిమట్ల శ్రీనివాస్ గౌడ్, పచ్చిమట్ల మహేష్ కుమార్ గౌడ్, గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు పచ్చిమట్ల మాధవి బాబు, ఎమ్మె కృష్ణ, పచ్చిమట్ల రాజు గౌడ్, గంధమల్ల శ్రీను, వల్లాల వెంకటేశ్, నాగరాజు, ఇమ్మడి నవీన్ నాయకులు, కుంటుబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల్లో బిజెపి గెలుపుకు కృషి చేయాలి



**ప్రజాపక్షం/చందంపేట;** చందంపేట మండలంలోని పోలేపల్లి గేటు వద్ద బిజెపి మండల శాఖ అధ్యక్షులు గుంటోజు వినోదాచారి ఆధ్వర్యంలో కార్యశాల నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా మండల ప్రభారీ ఏటి కృష్ణ హాజరై మాట్లాడుతూ మండలంలో పార్టీని సంస్థాగతగా బలోపేతం చేయాలని, వచ్చే స్థానిక ఎన్నికల్లో చేయాల్సిన కార్యక్రమాలు, పూర్తి స్థాయిలో బూత్ కమిటిలు వేయాలని, పార్టీ గెలుపుకు కార్యకర్తలు కృషి చేయాలని దిశానిర్ధేశం చేశారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు అంజినాయక్, మండల ప్రధాన కార్యదర్శి శివకృష్ణ, మండల మాజీ బిజేవైఎం అధ్యక్షులు అనిల్‌యాదవ్, యువ మోర్చా అధ్యక్షులు అనిల్‌గౌడ్, ఎస్టి మోర్చా అధ్యక్షులు సూక్యనాయక్, మండల నాయకులు అనిల్‌గౌడ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా సినారె జయంతి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ప్రముఖ కవి, జ్ఞానపీఠ అవార్డు గ్రహీత ఆచార్య సింగిరెడ్డి నారాయణరెడ్డి 94వ జయంతిని మంగళవారం మండలంలోని జప్తివీరప్ప గూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు గుడిపాటి కోటయ్య సినారె చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. సినారె తన రచనల ద్వారా తెలుగు సాహిత్యానికి ఎనలేని కృషి చేశారని అన్నారు. సినీ వినీలాకాశంలో నిలిచిన అభినవ అక్షర కర్ణుడు అన్నారు. ఆయన సాహిత్య కృషిని నేటి తరం కొనసాగించాలని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎడవెల్లి దామోదర్‌రెడ్డి, జగదీశ్వర్ రెడ్డి, మాధవి, శ్రీనివాస్‌రెడ్డి, రవికుమార్, రేణుక, విద్యార్థులు పాల్గొన్నారు.



# కాంగ్రెస్ కార్యకర్తల చేరిక అవాస్తవం

**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి;** మండల పరిధిలోని గాజీనగర్ ఉమ్మడి గ్రామ పంచాయతీకి చెందిన కాంగ్రెస్ కార్యకర్తలు బిఆర్ఎస్‌లో చేరడం అవాస్తవం అని కొండమల్లేపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఊట్కురి వేమన్‌రెడ్డి మండల కేంద్రంలోని పాల శీతలీకరణ కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో అన్నారు. ఈ సందర్భంగా వేమన్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల తర్వాత బిఆర్ఎస్ పార్టీ కి దూరంగా ఉండి తిరిగి బిఆర్ఎస్‌లోకి చేరన వారితో మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తూ నలుగురు చేరితే 200 మంది చేరారని అవాస్తవాలను ప్రచారం చేస్తున్న బిఆర్ఎస్ పార్టీకి కాంగ్రెస్ కార్యకర్తలు బుద్ది చెబుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి లక్కిదాస్‌నాయక్, మాజీ వైస్ ఎంపిపి కాసర్ల వెంకటేశ్వర్లు,



మార్కెట్ కమిటి డైరెక్టర్ పెద్దిశెట్టి సుధాకర్, మాజీ ఎంపిటిసి రాణిరాజునాయక్, సైదానాయక్, మంగ్యనాయక్, మంజుల రవి, ఏకుల సురేష్, ఇస్లావత్ సురేష్, కిషన్, విఠల్, నగేష్, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

# రుక్మారెడ్డిని డిసిసి అధ్యక్షులుగా నియమించాలి



**ప్రజాపక్షం/దేవరకొండ;** గత 40 సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీలో ఉంటూ పార్టీ అభివృద్ధికి కృషి చేసిన కాంగ్రెస్ పార్టీ సినియర్ నాయకులు తిప్పర్తి రుక్మారెడ్డిని నల్గొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా నియమించాలని దేవరకొండ మాజీ జెడ్పిటిసి మారుపాకుల అరుణ సురేష్‌గౌడ్, నల్గొండ పార్లమెంట్ కో ఆర్డినేటర్ సిరాజ్ ఖాన్‌లు కోరారు. మంగళవారం స్థానికంగా మాట్లాడుతూ మండలంలోని తెలుగుపల్లి గ్రామానికి చెందిన తిప్పర్తి రుక్మారెడ్డి గత 40 సంవత్సరాలుగా ఏ పదవి ఆశించకుండా కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి కృషి చేసిన వ్యక్తి అని అన్నారు. గత బిఆర్ఎస్ 10ఏళ్ల పరిపాలన కాలంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటూ అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్దుల గెలుపు కోసం, పార్టీ అభివృద్ధికి నిరంతరం కృషి చేసిన నిజమైన కార్యకర్త రుక్మారెడ్డి అని అన్నారు. వచ్చే స్దానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మరింత బలపడాలంటే రుక్మారెడ్డిని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులుగా నియమించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో దేవరకొండ మాజీ సర్పంచ్ వెంకటేశ్వర్లు, గోపాల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

# పోలీసుల విధులకు ఆటంకం పరిచిన వ్యక్తి అరెస్ట్

**ప్రజాపక్షం/ నల్లగొండ టౌన్ :** తాగిన మైకంలో పోలీసు అధికారుల విధులకు ఆటంకం పరుస్తూ, అర్ధరాత్రి ఆత్మహత్య యత్నం చేసుకున్న వ్యక్తి పై కేసు నమోదు చేయడం జరిగిందని వన్ టౌన్ సీఐ రాజశేఖర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూబరాత్రి సమయములో నల్లగొండ పట్టణానికి చెందిన రావిళ్ల నర్సింహా మద్యం త్రాగిన మత్తులో మోటార్ సైకల్ నడుపుకుంటూ వెల్లుచుండగా, రాత్రి విధులలో ఉన్న ఎస్సై జె. సైదులు దేవరకొండ రోడ్ లో డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ చేయగా, నర్సింహా కు ఆల్కహాల్ రీడింగ్ వచ్చిందని తెలిపారు . అది దృష్టిలో పెట్టుకొని, సదరు రావిళ్ల నర్సింహా పోలీసువారి విధులను ఆటంకపరచాలన్న ఉద్దేశ్యముతో, తన శరీరముపై ఎక్కడో పెట్రోల్ పోసుకొని వన్ టౌన్ పోలీసు స్టేషన్ మెయిన్ గేట్ లో నుండి లోపలికి వస్తుండగా, అక్కడే పార్కింగ్ స్టలంలో ఉన్న హోంగార్డ్ ప్రవీణ్, ఎవరు నువ్వు, ఏమైంది, అని అడుగుతూ అతని దగ్గరికి వెళ్తుండగా, తన పైనే డ్రంకెన్ డ్రైవ్ కేసు వేస్తారా అంటూ, ముందుగానే తన వెంట తెచ్చుకున్న లైటర్ తో తనకి తాను కాల్చుకునేందుకు ప్రయత్నిస్తుండగా, అది గమనించిన ప్రవీణ్ ఆపడానికి వెళ్ళగా, కాల్చుకునే క్రమంలో ఒక్క సారిగా మంటలు చెలరేగడంతో, వెంటనే విధులలో ఉన్న అంజత్ కానిస్టేబుల్ బెడ్ షీట్ కప్పి మంటలు ఆర్పి, అక్కడ ఉన్న పోలీస్ సిబ్బంది




వెంటనే అతని ప్రాణాలు కాపాడాలని, చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించడం జరిగిందని తెలిపారు . ఈ క్రమంలో ప్రాణాలకి తెగించి అతనిని కాపాడటానికి ప్రయత్నించిన హోంగార్డ్ ప్రవీణ్ చేతులకి గాయాలయ్యాయి. పోలీస్ అధికారుల విధులని నిరోధిస్తూ, అర్ధరాత్రి తాగిన మైకంలో ఆత్మహత్య యత్నం చేసిన రావిళ్ల నర్సింహా పై కేసు నమోదు చేసి విచారణ జరుపుచున్నట్లు సీఐ తెలిపారు.

## హిందూ మనోభావాలు దెబ్బతీస్తే తగిన మూల్యం తప్పదు

**ప్రజాపక్షం/తుర్కపల్లి:** రాష్ట్రంలోకానీ, దేశంలో కానీ ఏ మూలన చూసిన హిందూ ఆలయాలపై, హిందువులపై జరుగుతున్న దాడులతో కొన్ని కోట్ల మంది హిందువుల మనోభావాలు దెబ్బతీసే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కొన్ని పనులవల్ల రాబోయే రోజుల్లో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని, కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో హిందూ దేవాలయాలకు రక్షణ లేకుండా పోయిందని బిజెపి మండల అధికార ప్రతినిధి కందుకూరి వేణు అన్నారు. మంగళవారం తుర్కపల్లి మండల కేంద్రం లో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఒక వర్గానికి కొమ్ముకాస్తూ, కేవలం వాళ్ల ఓటు బ్యాంకు కోసం హిందూ దేవాలయాలపై జరుగుతున్న దాడులను పట్టించుకోవడం లేదని విమర్శించారు. రోడ్లపై ఎన్ని మసీదులు, చర్చిలు, దేవాలయాలు ఉన్నా కానీ బంజారాహిల్స్ పెద్దమ్మ గుడిని కూల్చివేయాల్సిన అవసరం ఏమిటని ప్రశ్నించారు. కనీసం గుడి యాజమాన్యానికి ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా అర్ధరాత్రి దేవాలయం కూల్చివేయడం సిగ్గుచేటని,హిందూ మనోభావాలను దెబ్బతీసేలా చేస్తున్నారని మండిపడ్డారు. హైదరాబాద్ లోఫాతిమా కాలేజ్ పూర్తి చెరువు కబ్జాలో ఉన్నగాని పట్టించుకోరని అన్నారు. తక్షణమే దేవాలయాన్ని కూల్చిన అధికారులను సస్పెండ్ చేయాలని, లేని పక్షంలో హిందువులంతా ఏకమై తగిన బుద్ధి చెప్తారని హెచ్చరించారు.



## మహాసభకు సిపిఐ శ్రేణులు

**ప్రజాపక్షం/గుండాల;** యాదాద్రి భువనగిరి జిల్లా సిపిఐ 4వ మహాసభలు మంగళవారం వలిగొండలోని సాయి గణేష్ ఫంక్షన్ హాల్‌లో జరిగాయి. ఈ మహాసభకు గుండాల మండల కేంద్రం నుండి సిపిఐ శ్రేణులు తరలివెళ్ళారు. మహాసభకు తరలిన వాహానాలను సిపిఐ జిల్లా కార్యవర్గ కుసుమాని హరిచంద్ర జెండాను ఊపి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ 100 సంవత్సరాలలోకి ప్రవేశించి శతజయంతి ఉత్సవాలను జరుపుకుంటున్న నేపథ్యంలో బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం, బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాటంలో పాల్గొని భూమి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం పోరాటాలు చేసి విజయం సాధించిందన్నారు. మహాసభకు తరలిన వారిలో సిపిఐ మండల కార్యదర్శి సభ్యులు అనంతుల రామచంద్రయ్య, కార్యవర్గ సభ్యులు సత్యనారాయణచారి, శ్రీను, స్వామి, కొమురయ్య, బక్కయ్య, యాదయ్య, మోహన్‌రెడ్డి ఉన్నారు.

## భీమనపల్లిలో మోగిన నీటిగంట




**ప్రజాపక్షం/మర్రిగూడ:** మండలంలోని దామెర భీమనపల్లి పాఠశాలలో విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా రోజుకు నాలుగు సార్లు నీటి గంట మోగిస్తున్నామని ప్రధానోపాధ్యాయులు ఉదావత్ లచ్చిరాం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాల విద్యార్థులలో అధిక శాతం తగిన మోతాదులో నీరు తాగడం లేదని,దీని వల్ల విద్యార్థులు పలు వ్యాధుల బారిన పడుతున్నారని, సరైన మోతాదులో నీళ్లు తాగకపోవడం వలన నీరస పడుతున్నారని కాబట్టి తమ పాఠశాలలో మంగళ వారం నుండి విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా నీటిగంట మోగిస్తున్నామని, విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు కూడా ఈ విధానాన్ని అవలంబిస్తున్నామని, నీటిగంట ఆవశ్యకతను విద్యార్థులకు వివరించామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వై మంజులత, సభావత్ వెంకట్ కుమార్,కొండ శ్రీనివాస్ మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## ఫుడ్ బాస్కెట్స్ పంపిణీ



**ప్రజాపక్షం/నాంపల్లి:** నల్గొండ డిప్యూటీ డిఎం అండ్ హెచ్ఓ జిల్లా టీబీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి ఆదేశాల మేరకు బుధవారం నాంపల్లి ప్రాథమిక ఆరోగ్య కేందంం సిబ్బంది ఆధ్వర్యంలో టీబీ రోగులకి ఫుడ్ బాస్కెట్స్ ఉచితంగా పంపిణి చేసారు. ఈ ఫుడ్ బాస్కెట్స్‌కి హాస్పిటల్ సిబ్బంది ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమాన్ని వైద్యధికారి డాక్టర్ భవాని సాగర్ ప్రారంభించి, అనంతరం ఆమె మాట్లాడుతూ ఈ ఫుడ్ బాస్కెట్ ప్రతి నెల పంపిణీ చేస్తారని ఇది ఆరు నెలలు వరకు అందజేయనున్నట్లు తెలిపారు. ఆహార పోషకాలతో పాటు అదే విధంగా టీబీ నిర్మూలనార్థం అందిస్తున్నమని అన్నారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ హెల్త్ ఆఫీసర్ ఏకానతం, సూపెర్వైసోర్ అంజలి, స్టాఫ్ నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్, హెల్త్ అసిస్టెంట్స్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## పింఛన్లను సకాలంలో అందించాలి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నెలా పేదలకు ఆసరా పింఛన్లను సకాలంలో అందించాలని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు తిరందాసు విష్ణు అన్నారు. మంగళవారం ఆయన స్థానికంగా మాట్లాడుతూ ప్రస్తుతం నెల చివరిలో పింఛన్లు ఇస్తుండడంతో ప్రజలు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ప్రతి నెలా మొదటి వారంలో ఇచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. గత ఎన్నికల సమయంలో ప్రభుత్వం పెన్షన్‌ను రూ.4వేలకు పెంచుతామని హామి ఇచ్చి అమలు చేయలేదని పెన్షన్లు అందించాలన్నారు.

# విద్యుత్ ఉద్యోగుల సంక్షేమానికి పోరాడే సంఘం 1104




ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ : విద్యుత్ ఉద్యోగుల సంక్షేమానికై చిత్తశుద్ధితో పోరాటం చేసే సంఘం 1104 మాత్రమేనని అనేక పర్యాయాలు రుజువైన విష యాన్ని కార్మిక వర్గం గమనించాలని ప్రధాన కార్య దర్శి జి.సాయిబాబు అన్నారు.తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ 1104 యూనియన్ నల్లగొండ జిల్లా సర్వసభ్య సమావేశం ప్రాంతీయ అధ్యక్షులు టి.జెపాల్ రెడ్డి అధ్యక్షతన, ప్రాంతీయ కార్యదర్శి నిమ్మ చెట్ల వెంకటయ్య.వెంకటయ్య ఆధ్వర్యంలో అత్యంత ఘనంగా నిర్వహించారు.అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో హైదరాబాద్ బైపాస్ రోడ్డు, గడి యారం సెంటర్ నుండి భారీ బైక్ ర్యాలీతో సమావేశ వేదిక రత్న ఫంక్షన్ హాల్ కి చేరుకున్నారు. సర్వసభ్య సమావేశ ప్రారంభానికి ముందుగా రాష్ట్ర అధ్యక్షులు వేమునూరి వెంకటేశ్వర్లు చేతుల మీదుగా అరుణ పతాకావిష్కరణ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 90వ దశకంలో ప్రారంభమైన విద్యుత్ సంస్కరణలు, ఎపిఎస్ఈబి సంస్థను డిస్కం కంపెనీ లుగా విడగొట్టి అనంతరం జరిపిన లోపాభిష్ట ట్రై పార్ట్ అగ్రిమెంటు,ఆ సందర్భంగా జరిగిన ప్రైవేటీకరణ దుశ్చర్యలను 1104 యూనియన్ ఒంటరి పోరా టంతో సమర్థంగా ఎదుర్కొన్న ఫలితంగానే నేటికీ టిఈ టియుఎఫ్ నామకరణంతో ప్రారంభమైన కాంట్రాక్టు కార్మికుల ఉద్యమంలో పెద్దన్న పాత్రను అత్యంత సమ ర్థవంతంగా పోషించామని ఆ ఫలితంగానే ఆ నాటి రాష్ట్ర ప్రభుత్వం ఒక అడుగు ముందుకు వేసి సంస్థలో విలీనం అంటూ ప్రకటన చేసిందని తదానంతరం జరి గిన పరిణామాల నేపథ్యంలో ఆర్టిజన్ నామకరణం ప్రత్యేక ఒప్పందం, విధివిధానాలను పొందుపరిచారని లోప భూయిష్టమైన విధివిధానాలను పున పరిశీలన చేయాలని ఒక సంస్థలో విధులు నిర్వహిస్తున్న ఉద్యో గులకు ఒకే రకమైన సర్వీస్ రూల్స్ ని అమలు పరచా లని 8 సంవత్సరాలుగా చిత్తశుద్ధితో కృషి చేస్తున్న సంఘం 1104 అని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం, యాజమాన్యాల కొంత సమయం ఇచ్చామని ఈ సమ యాన్ని వారు సద్వినియోగం చేసుకోవడంలో విఫలం చెందుతున్నారని సాధ్యమైనంత త్వరలో ఆర్టిజన్ ఉద్యోగులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సర్వసభ్య సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు వేమనూరి వెంకటేశ్వర్లు ,కార్యనిర్వాహక అధ్యక్షులు కే.రాజేం దర్,అదనపు ప్రధాన కార్యదర్శి జి.వరప్రసాద్, సలహా దారులు ఆర్.జనార్దన్ రెడ్డి హాజరవ్వగా, విశిష్టా అతి థులుగా.. విద్యుత్ జిల్లా అధికారి ఎ.వెంకటేశ్వర రావు,వి.కృష్ణారావు ,పి.సుచేందర్,అన్నయ్య,విద్యాసా గర్ రావు,ఎ.వేణు,వర్కింగ్ ప్రెసిడెంట్ ఎన్.వెంకన, అడిషనల్ సెక్రటరీ ఎం.భాస్కర్ రెడ్డి,జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ టి శ్రీనివాసులు, సీతారాములు మేరెడ్డి రామ్ రెడ్డి,కోశాధికారి శ్రావణ్ కుమార్ పాల్గొన్నారు.

## దొడ్డ పద్మ మృతి పట్ల సిపిఐ సంతాపం

ప్రజాపక్షం/హుజూర్‌నగర్: తెలంగాణ సాయుధ పోరాట యోధు రాలు,హుజూర్‌నగర్ మాజీ శాసనసభ్యులు,తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధులు అమరజీవి కామ్రేడ్ దొడ్డా నర్సయ్య సతీమణి కామ్రేడ్ దొడ్డ పద్మ గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం హైదరాబాద్‌లో తుదిశ్వాస విడిచారు. ఆమె మృతి పట్ల భారతకమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు యల్లావుల రాములు, పట్టణ కార్యదర్శి గుండు వెంకటేశ్వర్లు,జిల్లా కార్యవర్గ సభ్యులు దేవరం మల్లీశ్వరీ,జిల్లా కౌన్సిల్ సభ్యులు యల్లావుల రమేష్,ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు జడ శ్రీనివాస్ లు హుజూర్‌నగర్‌లోని సిపిఐ పార్టీ కార్యాలయంలో సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆమె మృతి సిపిఐ పార్టీకి తీరనిలోటని ఆమె పార్టీకి,ప్రజలకు చేసిన సేవలను కొనియా డారు. మామిడి వెంకయ్య, దొంతగాని సత్యనారాయణ,సోమగాని కృష్ణ,పొనుగుపాటి వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.

## భక్తుల పూజలు



ప్రజాపక్షం/భువనగిరి రూరల్ : నాగుల పంచమి పర్వదినం పుర స్కరించుకొని భువనగిరిలోని శ్రీ పచ్చలకట్ట సోమేశ్వర స్వామి ఆల యంలో మంగళవారం భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పుట్టలో పాలు పోసి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ కొల్లూరు రాజు మాట్లాడుతూ భువ నగిరి పట్టణంలోని అతి పురాతన పెద్ద దేవాలయం శ్రీ పచ్చలకట్ట సోమేశ్వర స్వామి వారి ఆలయంలో నాగుల పంచమి వేడుకలు ఘనంగా నిర్వహించినట్లు చెప్పారు. ప్రతి సంవత్సరం లాగా పుట్టలో పాలు పోసి వారు కోరిన కోరికలు స్వామివారి అనుగ్ర హంతో నెరవేరాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన పూజారి కప్పగంతుల నాగరాజు శర్మ, కప్పగంతుల ప్రవీణ్ శర్మ, పుట్టపాక భీష్మ శర్మ, దేవేందర్ మహిళా భక్తులు పాల్గొన్నారు.

## ఆగస్టు 3వరకు చేయూత ఆసరా పింఛన్లు పంపిణీ

ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ : జిల్లాలో వివిధ రకముల చేయూత ఆసరా పింఛన్లు (అనగా వృద్ధాప్య, వితంతు, వికలాంగుల, చేనేత, కల్లుగీత, మరియు ఒంటరి మహిళ పింఛన్లు) పొందు పింఛనుదార్లకు ఈనెల29 నుండి 0ఆగస్టు 3వరకు బట్వాడా చేయబడుతుందని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శేఖర్ రెడ్డి తెలిపారు. పింఛను దారులు ఈ నెల నుండి పింఛనుదారులు ప్రభుత్వము వారు ప్రవేశపెట్టిన ముఖ గుర్తింపు సాఫ్ట్ వేర్ ద్వారా పింఛను పొందలని 3 నెలలు దాటి పింఛను తీసుకోని పింఛను దారులకు 4నెలల పింఛను ఇవ్వడం జరుగుతుందన్నారు.పింఛను మొత్తం మధ్య దళారీలను నమ్మకుండా నేరుగా సంబంధిత పోస్టల్ శాఖ వారి వద్ద నుండి పొందవలని,పింఛను పొందుటకు ఎటువంటి సొమ్ము చెల్లించవలసిన అవసరము లేదని పేర్కొన్నారు. పింఛను మొత్తము సొమ్ము రూ.16 తో సహా అడిగి తీసుకోవాలని సూచించారు.

## శ్రీరేణుక ఎల్లమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట

ప్రజాపక్షం/నార్కట్ పల్లి: శ్రీశ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమమును గురిజ అశోక్ స్వామి ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. మంగళవారం ప్రతిష్ట కార్యక్రమంలో బాగంగా మూడో రోజు గణపతి పూజ , నవగ్రహసర్వతోభద్రమండలి పూజలు , హోమాలు, శతాధిక ప్రతిష్ట చార్యులు సిద్ధాంతి బేతోజు సత్యనారాయణ శాస్త్రి , అర్చకులు బ్రహ్మశ్రీ ఉత్తరపల్లి నరసింహచార్యులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గురిజ రామచంద్రులు ,గురిజ రాములు, మధు, సైదులు, పసునూరి శ్రీనివాస్ , భక్తులు అధిక సంఖ్య లో పాల్గొన్నారు.

## సైకిల్‌యాత్ర పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాపక్షం/ మిర్యాలగూడ: ఎస్ఎఫ్ఐ మిర్యాలగూడ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో సంఘర్షణ సైకిల్‌యాత్ర పోస్టర్ ను స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎస్ఎఫ్ఐ కేంద్ర కమిటీ సభ్యుడు ఖమ్మంపాటి శంకర్ ఆవిష్కరించి మాట్లాడా రు. జిల్లా వ్యాప్తంగా ఈనెల 30 నుంచి ఆగస్టు వరకు జరిగే ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ, సంక్షేమ హాస్టళ్లలో సంరక్షణ కై నిర్వహించే సంఘర్షణ సైకిల్‌యాత్రను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కుర్ర సైదానాయక్, వీరన్న, సుమన్, అనిల్, అజయ్, తరుణ్, కల్యాణ్, కవిత, ప్రసన్న, నాగపుష్ప తదితరులు పాల్గొన్నారు.



## విముక్తిలో చురుకైన పాత్ర పోషించిన విశ్వవిద్యాలయాలు అభ్యున్నతిలో సైతం తోడ్పడాలి

తెలంగాణ విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి

ప్రజా పక్షం/నల్లగొండ టౌన్ :విశ్వవిద్యాల యాల వేదికగా ప్రజా విచారణ చేపట్టుతున్న తెలంగాణ విద్యా కమిషన్ మంగళవారం మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయంలో ప్రజా విచారణ చేపట్టింది. తెలంగాణ విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి, కమిషన్ సభ్యులు ఆచార్య పి ఎల్ విశ్వేశ్వర రావు, డాక్టర్ చార కొండ వెంకటేష్, శ్రీమతి జ్యోత్స్న శివారెడ్డి లు ప్రజా విచారణ చేపట్టారు. ఉదయం విశ్వవిద్యా లయం చేరుకున్న కమిషన్ సభ్యులు విశ్వవిద్యాల యంలోని వివిధ విభాగాలను సందర్శించి మౌలిక వసతులను ప్రత్యక్షంగా పరిశీలించారు. మొదట విశ్వవిద్యాలయ ప్రస్థానం ప్రస్తుత స్థితిగ తులపై ఉపకులపతి ఆచార్య కాజా అల్తాఫ్ హుస్సేన్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం అధికారులు విశ్వవిద్యా లయ అధ్యాపక, బోధనేతర సిబ్బంది మరియు విద్యార్థులతో విశ్వవిద్యాలయంలో నెలకొన్న వివిధ సమస్యలు, అవసరాలపై ప్రజా విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా కమిషన్ చైర్మన్ ఆకు నూరి మురళి మాట్లాడుతూ తెలంగాణ సాధ నలో ప్రముఖ పాత్ర పోషించిన విశ్వవిద్యాల యాలు అభ్యున్నతికి సైతం తోడ్పడాలన్నారు. విద్య విముక్తి, అభ్యున్నతికి,దీర్ఘకాలిక ప్రయోజ నాలను అందించే ఉత్తమ సాధనంగా , నైపుణ్యా లను అందించి నైతికత, సమతా భావన, దేశభ క్తిని పెంపొందించే గురుతర బాధ్యత విశ్వవిద్యా లయాలపై ఉందన్నారు. అనంతరం కమిషన్ విద్యార్థులు అధ్యాపకులు బోధనేతర సిబ్బంది , విద్యార్థి సంఘాలతో పాటు ప్రైవేట్ కళాశాలల యాజమాన్యంతో తమ సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ కళాశాలలు, క్రీడా సదుపాయాలు, హాస్టల్లో నెలకొన్న సమస్య లపై కమిషన్ ముందు ఉంచారు. అవుట్సోర్సింగ్ విధానం ద్వారా 250కి పైగా ఉన్న అవుట్సో ర్సింగ్ ఉద్యోగులు మూడు అంచల వేతన విధానం ద్వారా ఉద్యోగులు నష్టపోతున్నట్లు ఔట్సోర్సింగ్ ఏజెన్సీ విధానాన్ని రద్దు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య అల్వాల రవి, ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ అరుణప్రియ,డాక్టర్ సుధారాణి, ఆచార్య కొప్పుల అంజిరెడ్డి, ఆచార్య ఆకుల రవి, ఆచార్య రేఖ, డాక్టర్ మదిలేటి, డాక్టర్ మిరియాల రమేష్, డాక్టర్ దోమల రమేష్ తదితర అధ్యాప కులు విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యా కమిషన్ చైర్మన్‌ను కలిసిన మానవ హక్కుల వేదిక కమిటీ

ప్రజా పక్షం/నల్లగొండ టౌన్ : తెలంగాణ రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి మంగళ వారం మహాత్మా గాంధీ యూనివర్సిటీ వచ్చిన సంద ర్భంగా మానవ హక్కుల వేదిక జిల్లా కమిటీ ప్రతిని ధులు వారిని కలిసి నల్లగొండ జిల్లాలో ప్రభుత్వ పాఠ శాలలలో ఉన్న లోపాల గురించి చందంపేట మండ లంలోని మూసివేయబడిన, మూసి వేయడానికి సిద్ధంగా ఉన్న స్థితిగతుల గతుల గురించి మెమో రాండం సమర్పించి వివరాలను వెల్లడించారు. అదేవి ధంగా చందంపేట మండల పరిధిలో గల పొగిళ్ల గ్రామంలో ఉన్న ప్రాథమిక పాఠశాలలో 48 మంది విద్యార్థులకు గత ఆరు సంవత్సరాల నుండి ఒకే ఉపా ధ్యాయుడు ఉన్న విషయాన్ని విద్యా కమిషన్ దృష్టికి తీసుకొచ్చారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా అధ్య క్షులు అక్కనపల్లి వీరస్వామి, ప్రధాన కార్యదర్శి అద్దంకి దశరథ, సహాయ కార్యదర్శి లక్ష్మల్ల మధు, గద్దం వెంకటరమణ ఉన్నారు.

## సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన

ప్రజాపక్షం/తుంగతుర్తి: వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులు, పరిసరాలు పరి శుభ్రత కార్యక్రమాన్ని డాక్టర్ లింగ మూర్తి ఆధ్వర్యంలో మంగళవారం మండల పరిధిలోని పాఠశాలలో అవగా హన కార్యక్రమం నిర్వహించి మాట్లా డారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులపై ప్రజలు తమ ఇండ్లతో పాటు ఇంటి పరిస రాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీరు నిల్వ లేకుండా చూసుకోవా లన్నారు. అనంతరం పాఠశాల విద్యార్థు లకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి సోమన్న, ఆశాలు చిత్తలూరి రమ్య, లీలమ్మ, మేరమ్మ, పద్మ, ప్రధానోపాధ్యా యురాలు సునితారాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## మారుమూల ప్రాంత యువకులకు అండగా జాలే నరసింహారెడ్డి

ప్రజాపక్షం/చందంపేట; నల్గొండ జిల్లా చందంపేట మండలం ఉస్మాన్‌కుంట, యాపలపాయతండా, రేగులగడ్డ గ్రామాలకు చెందిన యువకులైన 12మంది ఆటో డ్రైవర్లకు జాలే నర్సింహారెడ్డి నూతన ఆటోలను అందించి వారికి సహాయ సహకారాలను అంద జేయడం జరిగింది. ఈసందర్భంగా కష్టకాలంలో ఎల్లప్పుడు యువ తకు అండగా ఉంటే ఏకైక వ్యక్తి జాలే నర్సింహారెడ్డి, తిరుపతి రెడ్డిలు అని అన్నారు. పేదలకు కష్ట వచ్చిందంటే మేమున్నామంటూ ముందుకు వచ్చి వారి కష్టాలను తీర్చి వారిని ప్రోత్సహించే సహృద యులు జాలే బ్రదర్స్ అని అన్నారు. అనంతరం జాలే నర్సింహారెడ్డి మాట్లాడుతూ రేగులగడ్డ గ్రామ చుట్టుపక్కల ప్రజలు యువత ఎన్ని కల్లో తనను ఆశీర్వదించాలని వారికి ఎల్లప్పుడు అందుబాటులో ఉంటూ అండగా ఉంటానని తెలిపారు.



# సేవా కార్యక్రమాలతో సమాజాన్ని మెరుగుపరుద్దాం

**డాక్టర్ కాపా మురళీకృష్ణ**





ప్రజాపక్షం/వైరా: వైరా లయన్స్‌క్లబ్ గ్రేట్ విజన్ క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం వైరాలో మిట్టపల్లి గార్డెన్ నందు సోమవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా లీడ్ ఫోర్స్ జిల్లా మానిటర్ యూత్ లీడ్ ఫోర్స్ మాజీ గవర్నర్ పిఎంజెఎఫ్ లయన్ డాక్టర్ కాపా మురళీకృష్ణ విచ్చేసి మాట్లాడుతూ ఈ నెల నుండి 2025–26 లయన్స్ నూతన సంవత్సరం ప్రారంభమైందని, ఈ సంవత్సరం ప్రతి సభ్యుడు తమ లక్ష్యాలను ఎలా సాధించాలో ఆలోచించే సమయం ఇదని, ప్రతి సభ్యుడు తమ లక్ష్యాలను వాటిని ఎలా సాధించాలో ఆలోచించాలని, ప్రతిఒక్కరూ నాయకత్వం కోసం సేవ చేయండి, సేవ కోసం నాయకత్వం వహించండి అని ఈ సందర్భంగా పేర్కొన్నారు. మన సమాజాన్ని ఇంకా మెరుగుపరచాలని అన్నారు. మనందరం కలిసి పనిచేస్తూ దీని గొప్ప నాయకత్వం మనావతా సేవా అభివృద్ధి, విజయం సాధిస్తామని అన్నారు. ఇప్పటికే వైరాలోని రెండు క్లబ్‌లు కూడా ఇంటర్నేషనల్ స్థాయిలో మంచి గుర్తింపు తీసుకొచ్చాయని మున్ముందు కూడా సేవలో ముందుండాలని ఆయన పేర్కొన్నారు. నూతన క్లబ్‌ల ప్రమాణస్వీకారం ఇన్స్టాలేషన్ ఆఫీసర్ అమృతవల్లి కోటేశ్వరరావు, వైరా అధ్యక్షులుగా వై.బుచ్చిరామారావు, గ్రేట్ విజన్ క్లబ్ అధ్యక్షులుగా జాల పుల్లారావు, నూతన కార్యవర్గాన్ని ప్రమాణస్వీకారం చేయించారు. ఇంజక్షన్ ఆఫీసర్‌గా యానాల మోహన్‌రెడ్డి, నూతన సభ్యులచే ప్రమాణస్వీకారం చేయించారు. అనంతరం ఫాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ కాపా మురళీకృష్ణ పుట్టినరోజు వేడుకలను జిల్లా 320 గవర్నర్ మదన్మోహన్ రేపాల ఆదేశాల మేరకు అత్యంత ఘనంగా క్లబ్‌లు కేక్ కటింగ్ చేసి సభ్యులు మధ్య శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా నిరుపేద నలుగురు మహిళలకు కుట్టుమిషన్లు అతిథులచే అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్యాబినెట్ సెక్రటరీ చిలుకూరి రామకృష్ణ, వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్2 సతీష్‌కుమార్ కోడె, జిల్లా మార్కెటింగ్ కోఆర్డినేటర్ లగడపాటి ప్రభాకర్‌రావు, జోన్ చైర్మన్ చింతోజు నాగేశ్వరరావు, బెల్లం కొండ ఆంజనేయులు, ఇన్స్టాలేషన్ ప్రోగ్రాం చైర్‌పర్సన్ వుంద్రు శ్యామ్ బాబు, కోచైర్‌పర్సన్ కొమ్మినేని ఆంజనేయ శివప్రసాద్, రీజన్ చైర్పర్సన్ పెకనుగొండ ఉపేంద్రరావు, క్లబ్ మహిళా కోఆర్డినేటర్ మాదినేని సునీత, జిల్లా కమిటీ సభ్యులు వనమా విశ్వేశ్వరరావు, నూకల ప్రసాదరావు, నూకల శ్రీనివాసరావు, చింతనిప్పు వెంకటయ్య, ఎల్‌సిఐఎఫ్ కోఆర్డినేటర్స్ తోటకూర శ్రీకాంత్, చింతలపూడి వెంకటేశ్వరరావు, చైల్డ్ ఫుడ్ క్యాన్సర్ కోఆర్డినేటర్ కొరకొప్పుల శ్రీధర్‌గౌడ్, లయన్స్ క్లబ్ సెక్రటరీ చెరుకూరి శ్రీనివాసరావు, కోశాధికారి ఉయ్యూరి రామకృష్ణ, గద్దె నీరజ, వైస్ ప్రెసిడెంట్ రంగా సత్యనారాయణ, జలా మహాలక్ష్మి, ఏపూరి రాజారావు, పిఆర్‌వో పులి కృష్ణార్జున్‌రావు, ఘాట్ సభ్యులు కొల్లా రాంబాబు, కన్యదారి హనుమాయమ్మ, షేక్ లాల్‌మహ్మద్, మచ్చా రామారావు, జాల మహా4ఆలక్ష్మి, యలమద్ది శ్రీనివాసరావు, లయన్స్‌క్లబ్ సభ్యులు మిట్టపల్లి సత్యంబాబు, భారతి, డాక్టర్ శ్రీధర్‌గౌడ్, డాక్టర్ శ్రీనివాసరెడ్డి, డాక్టర్ పెంటేల భాస్కరరావు, మిట్టపల్లి నాగి, మిట్టపల్లి రమణ, మిట్టపల్లి శ్రీనివాసరావు, మాదినేని దుర్గాప్రసాద్, పుప్పాల అనంతరామయ్య, నల్లమోతు లక్ష్మీ నారాయణ, రంగా రమేష్, సంగిశెట్టి వెంకటేశ్వర్లు, రాయపూడి వెంకటేష్, కట్ల సురేష్, వుంద్రు వరలక్ష్మి, కొమ్మినేని భరాతి, నూకల అన్నపూర్ణ, ఏడునూతల శ్రీదేవి, రాయపూడి రజిని, చింతోజు సీత, రంగా వాసవి పాల్గొన్నారు.

# ఆకస్మికంగా హెల్త్ సెంటర్ తనిఖీ

**వైద్య సేవలపై ఆరా తీసిన ఆయూష్ డైరెక్టర్**



ప్రజాపక్షం/నేలకొండపల్లి : స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ను రాష్ట్ర ఆయూష్ డైరెక్టర్... ఖమ్మం ఉమ్మడి జిల్లా సీజనల్ వ్యాధుల పరిశీలకులు డాక్టర్.శ్రీకాంత్ బాబు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోగుల వద్దకు వెళ్లి అందుతున్న వైద్య సేవలు గురించి అడిగి తెలుసుకున్నారు. ల్యాబ్ లో జరుగుతున్న వివిధ పరీక్షల ను పరిశీలించారు. రోజుకు ఎంత మందికి పరీక్షలు జరుపుతారు. ఎంత మంది వస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం వైద్యులతో రివ్యూ సమావేశం ను నిర్వహించారు. జ్వర బాధితులు ఏ ప్రాంతం నుంచి ఎక్కువగా వస్తున్నారు. అక్కడి సమస్యలు ఏంటీ.. తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి చర్చించారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధులు ఎలా ఉన్నాయి. వాటి నివారణ కు వెద్యులు తీసుకుంటున్న చర్యలు గురించిఆరా తీశారు. సీజనల్ వ్యాధులకు సంబంధించి సరిపడ మందులు ఉన్నాయా లేవా అని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సీజనల్ వ్యాధులు రాకుండా ఖమ్మం ఉమ్మడి జిల్లాలలో తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జ్వర బాధితులను గుర్తించి తక్షణమే వైద్య సేవలు అందించాలని సూచించారు. తొలుత ఇంటింటా సర్వే చేసి బాధితులను గుర్తించాలని ఆదేశించారు. విధుల పట్ల నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయూష్ రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ ప్రమీలా, మండల వైద్యాధికారులు డాక్టర్ మంగళ, డాక్టర్ కె.రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# నాసిరకంగా నిర్మాణ పనులు..!

- వంగిపోయిన సైడ్ హ్యాండ్రిల్స్
- గుట్టు చప్పుడు కాకుండా మట్టితో పూడ్చివేత



ప్రజాపక్షం/పాల్వంచ : పుల్లాగూడెం నుండి ప్రభాత్ నగర్ వరకు కోటి 70 లక్షలతో నిర్మించే పనుల్లో భాగంగా నూతనంగా నిర్మిస్తున్న రహదారి, కాజ్‌వే నిర్మాణ పనుల్లో నాణ్యతకు తిలోదకాలు ఇచ్చారు. దీనితో కిన్నెరసాని ప్రాజెక్టు నుండి విడుదల చేసిన చిన్నపాటి వరద ఉధృతికి చప్టా అప్రోచ్ కింది భాగం కోతకు గురైంది. దీనితో పాటుగా చప్టాకు ఇరువైపులా నిర్మించిన సైడ్ హ్యాండ్రిల్స్‌లో కొన్ని వంగిపోగా, మరికొన్ని పూర్తిగా ఊడిపోయాయి, ఇంకొన్ని ఊగుతున్నాయి. దీనిని గమనించిన గుత్తేదారు గుట్టు చప్పుడు కాకుండా చప్టా కింద కోతకు గురైన ప్రదేశంలో సోమవారం పెద్ద పెద్ద రాళ్ళను వేసి మట్టితో పూడ్చివేశారు. దీనితో పనుల నాణ్యతపై పలు సందేహాలు వ్యక్తమవుతున్నాయి.ఇంత జరుగుతున్నా సంభందిత అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవటంతో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అధికారుల అలసత్వం, అభివృద్ధి పనులపై వారు తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**పరిశీలించి చర్యలు తీసుకొంటాం...**

ఈ విషయం పై పంచాయితీ రాజ్ శాఖ ఈఈ శ్రీనివాస్ వివరణ కోరగా .. ఇంత వరకు మా దృష్టికి రాలేదని, పరిశీలించి తగు చర్యలు తీసుకొంటామని తెలిపారు.

# దేవాలయ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేయాలి



ప్రజాపక్షం/నేలకొండపల్లి: దేవాలయం అభివృద్ధి కి పాలకవర్గం శక్తి వంచన లేకుండా కృషి చేయాలని మంత్రి క్యాంపు కార్యాలయం ఇంచార్జీ తుంబూరు దయాకర్రెడ్డి సూచించారు. మండల కేంద్రం లోని శ్రీ భీమేశ్వరస్వామి దేవాలయం పాలకవర్గం ప్రమాణా స్వీకారం కార్యక్రమం ను నిర్వహించారు. చైర్మన్ ఐతనబోయిన శ్రీనివాసరావు, సభ్యులు గా సురేందర్, శ్రీను, నాగయ్య, యామిని, రామకృష్ణ, వెంకటేశ్వర్లు లు ప్రమాణాస్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆలయ అభివృద్ధి కి పాటుపడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటి చైర్మన్ వెన్నపూసల సీతారాములు, శాఖమూరి రమేష్, కొడాలి గోవిందరావు, రాయపూడి నవీన్, జెర్రిపోతుల అంజిని, బచ్చలకూరి నాగరాజు, గూడవల్లి రాంబ్రహ్మాం. చిదుములు జానారెడ్డి, శంకర్, వాకా శ్రీనాథ్, కెలాసపు వెంకటేష్మల్లయ్య, రెడ్డిమళ్ల బాబురెడ్డి, కడియాల నరేష్, గుండా బ్రహ్మాం, మన్నె రవి తదితరులు పాల్గొన్నారు. అనంతరం నేలకొండపల్లి లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. త్వరగా పూర్తి చేసుకోవాలని సూచించారు.

# నేటి నుండి అందుబాటులోకి రక్తనిధి కేంద్రాలు

**- మణుగూరు, అశ్వారావుపేట ఆస్పత్రుల్లో ప్రారంభం**

ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : రక్త లేక ప్రాణాలు కోల్పోతున్న అనేక సందర్భాలు చూస్తున్నాం, ప్రధానంగా ఏజెన్సీ ప్రాంతాల్లో ఈ సమస్య మరింత తీవ్రంగా ఉంటుంది. ఈ పరిస్థితిని అధిగమించేందుకు నేటి నుండి మణుగూరు, అశ్వారావుపేట ప్రభుత్వ ఆస్పత్రుల్లో రక్తనిధి కేంద్రాలు అందుబాటులోనికి రానున్నాయి. ఈ మేరకు జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అనుమత్రి పత్రాలను అందజేశారు. త్వరలో ఇల్లెందు ఆస్పత్రికి కూడా ఈ సౌకర్యం రానుంది. కొత్తగూడెం, పాల్వంచ, భద్రాచలం, సత్తుపల్లి ఆస్పత్రుల్లో రక్తనిధి కేంద్రాలు అందుబాటులో ఉన్నాయి. గర్భిణీలుకు, ప్రమాదబాధితులకు రక్తం కావాలంటే భద్రాచలం, కొత్తగూడెం, పాల్వంచ, సత్తుపల్లి ఆస్పత్రులకు వెళ్లాల్సి వచ్చేది. కానీ నేడు అందరికీ అందుబాటులోకి రక్తనిధి కేంద్రాలు వచ్చాయి. వాస్తవానికి మణుగూరు, అశ్వారావుపేటకు 2023లోనే ప్రారంభం కావాల్సి ఉన్నప్పటికీ సాంకేతిక కారణాల వల్ల ఆగిపోయింది. కలెక్టర్ చొరవతో ఇప్పుడు ఆ సమస్యను అధిగమించారు.

# ఎమ్మెల్యే పాయం చొరవతో ఆలయాల్లో బోర్లు



ప్రజాపక్షం/అశ్వాపురం: పినపాక ఎంఎల్‌ఏ పాయం వెంకటేశ్వర్లు చొరవతో అశ్వాపురం మండల పరిధిలోని గొందిగూడెం గ్రామం ఆదివాసుల ఇలవేల్పులు శ్రీ నాగరాజు గుడి, శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో తాగునీటి బోర్లను ఏర్పాటు చేశారు. ఆలయాల్లో తాగునీటి సౌకర్యం లేక భక్తులు ఇబ్బంది పడుతున్నారని ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు ఎంఎల్‌ఏ దృష్టికి తీసుకెళ్లగా స్పందించి తన సొంత నిధులతో బోర్లు వేయించారు. ఈసందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు ఎంఎల్‌ఏ పాయం వెంకటేశ్వర్లుకు సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

# సెబర్ మోసాలపై అవగాహన సదస్సు



ప్రజాపక్షం/అశ్వాపురం: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం పోలీసు ఆధ్వర్యంలో నిర్వహించిన సైబర్ మోసాల అవగాహన సదస్సులో ఎస్ఐ మధు ప్రసాద్ పాల్గొని సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఫోన్ కాల్స్, సోషల్ మీడియా, ఫిషింగ్ మెజేజ్‌లు, ఆన్‌లైన్ ట్రాన్సాక్షన్లలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే అంశాలపై స్పష్టమైన సూచనలు చేశారు. అనుమానాస్పద లింకులు క్లిక్ చేయవద్దని, వ్యక్తిగత సమాచారం ఎవరితో పంచుకోవద్దని, బలమైన పాస్ వర్డులను ఉపయోగించాలని, ఆన్‌లైన్‌లో డబ్బు లావాదేవీలు చేసే ముందు ధ్రువీకరణ చేసుకోవాలని, సైబర్ మోసాలనికి గురైనట్లయితే వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. విద్యార్థులకు ఎలాంటి సమస్యలు ఉన్న వెంటనే పోలీసు వారికి సమాచారం అందించాలన్నారు. ఈకార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ యన్ శేషుబాబు, ఏఎస్ఐ రామచంద్రారెడ్డి, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# కెజిబివి కార్మికుల వేతనాలు పెంచాలి



ప్రజాపక్షం/జూలూరుపాడు: కెజిబివి కార్మికుల వేతనాలు పెంచాలని ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా టియుసిఐ జిల్లా ఉపాధ్యక్షులు ఏదులాపురం గోపాలరావు డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని కెజిబివి పాఠశాలలో కార్మికులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పని గంటలు పెంచే 282 జీవోను రద్దు చేయాలని, ఈనెల 31న జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నాను జయప్రదం చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో టియుసిఐ కొత్తగూడెం ఏరియా ఉపాధ్యక్షులు రాయల సిద్దు, శిరీష, రమాదేవి, రాధ, స్వరూప, రేణుక, నిర్మల, అరుణ, సునీత, కళ్యాణి, స్రవంతి, తదితరులు పాల్గొన్నారు.

# చికెన్ సెంటర్‌లపై చర్యలు తీసుకోవాలి



ప్రజాపక్షం/జూలూరుపాడు: అనారోగ్యంగా ఉన్న కోళ్లను ప్రజలకు విక్రయిస్తున్న కొన్ని చికెన్ సెంటర్‌లపై చర్యలు తీసుకోవాలని బిఎస్‌పి పార్టీ ఆధ్వర్యంలో మండల మహిళా అధ్యక్షురాలు భోగా లలిత, మండల కార్యదర్శి గార్లపాటి సైదులు జూలూరుపాడు పశువుల వైద్యాధికారి సాయిరాం సందీప్‌కు మెమోరాండం అందించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మాంసం ప్రియులకు కొన్ని చికెన్ సెంటర్ల వారు అనారోగ్యంతో ఉన్న కోళ్లను ఎటువంటి వైద్య పరీక్షలు నిర్వహించకుండానే కొన్ని చికెన్ సెంటర్ల నిర్వహకులు మాంసాన్ని విక్రయిస్తున్నారని, అలా విక్రయించడం వలన అనారోగ్యంతో ఉన్న మాంసాన్ని తిని అనారోగ్య పాలవుతున్నారని అన్నారు. ప్రజల ఆరోగ్య ప్రయోజనాల కొరకు చర్యలు తీసుకోవాలని కోరారు.

# మీనాక్షి నటరాజన్‌ను కలిసిన కట్ల రంగారావు



ప్రజాపక్షం/వైరా: హైదరాబాద్‌లో ఎంఎల్‌ఏ క్వార్టర్స్‌లో ఏఐసిసి తెలంగాణ కాంగ్రేస్ ఇంచార్జి మీనాక్షి నటరాజన్, టిపిసిసి అధ్యక్షులు బొమ్మా మహేష్‌కుమార్‌గౌడ్, ఉమ్మడి 10 జిల్లాల కాంగ్రేస్ వ్యవహారాల పైన సమీక్ష సమావేశాలు నిర్వహించారు. నల్లగొండ జిల్లా సమీక్ష సమావేశంలో పాల్గొని ఏఐసిసి తెలంగాణ కాంగ్రేస్ ఇంచార్జి మీనాక్షి నటరాజన్‌ని, టిపిసిసి అధ్యక్షులు ఎమ్మెల్సీ బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్‌ని నల్గొండ జిల్లా కోఆర్డినేటర్ టిపిసిసి ప్రధాన కార్యదర్శి కట్ల రంగారావు మర్యాదపూర్వకంగా కలిశారు.

# ఇళ్లు ఉన్నవారికే ఇందిరమ్మ ఇళ్లు..!

**-నిబంధనలకు తూట్లు**
**-కూసుమంచి మండల పరిషత్ అధికారుల నిర్వాకం**
**-ఎంపిడిఒ కోటా అంటూ ప్రచారం**



**ప్రజాపక్షం/కూసుమంచి:** పేదవారి సొంతింటి కలను నిజం చేయడానికి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకం నిరుపేదలకు అందని ద్రాక్షగానే మిగిలింది. కమర్షియల్ షట్టర్లతో కూడిన గృహ సముదాయం ఉన్నవారికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయడంతో ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకం అబాసుపాలు కాక తప్పట్లేదు. పూర్తి వివరాల్లోకి వస్తే

### ఇందిరమ్మ గృహ నిబంధనలకు తూట్లు....

ఎక్కడ ఇల్లు లేని నిరుపేదలకు మాత్రమే ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని ప్రభుత్వం నిబంధనలు ఉన్నప్పటికీని ఆ నిబంధనలకు తూట్లు పొడుస్తూ కూసుమంచి మండల కేంద్రంలో ఏనుగుల సుహాసిని భర్త భాస్కర్‌కు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేశారు. తన సొంత గ్రామమైన ముదిగొండ మండలం వల్లబిలో కమర్షియల్ షట్టర్లతో కూడిన ఆరు గదుల సొంతిల్లు ఉండగా కూసుమంచిలో ఇందిరమ్మ ఇల్లు కేటాయించారు. వల్లబికి చెందిన ఏనుగుల భాస్కర్ అనే వ్యక్తి బోరింగ్ మెకానిక్‌గా కూసుమంచి మండల పరిషత్ కార్యాలయంలో పని చేస్తున్నాడు ముందస్తు ప్రణాళికతో తన అడ్రస్‌ను కూసుమంచి మండల కేంద్రానికి మార్చుకున్నాడు. వల్లభి మెయిన్ సెంటర్‌లో రెండు కమర్షియల్ షట్టర్లతో పాటు నాలుగు గదుల ఇండ్లు ఉండి దానికి ప్రతి నెల వేళల్లో అద్దె పొందుతూ నిరుపేదనంటూ అధికారులను తప్పుదోవ పట్టించి, మండల పరిషత్ కార్యాలయంలో తనకున్న పరిచయాలతో నిబంధనలకు విరుద్ధంగా తన భార్య పేరుతో ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కావడం గ్రామ ప్రజలను మరింత విస్మయానికి గురి చేస్తుంది.

### మండల పరిషత్ అధికారులు నిర్వాకం....

వల్లబికి చెందిన ఏనుగుల భాస్కర్ అనే వ్యక్తి కూసుమంచి మండలంలో మండల పరిషత్ ఆధ్వర్యంలో బోరింగ్ మెకానిక్‌గా పని చేస్తూ మండల పరిషత్ అధికారులకు దగ్గర అవుతూ తనకున్న అవకాశాల నింటిని ఉపయోగించుకొని అవసరమైతే మండల పరిషత్ కార్యాలయంలో ఉన్నతాధికారుల మెప్పు కోసం కిందిస్థాయి అధికారులపై లేనిపోనివి చెబుతూ మండల పరిషత్ అధికారికి దగ్గరయ్యే ప్రయత్నం చేశాడని, అనేక సంవత్సరాలుగా బదిలీపై వెళ్లిన అధికారులు గుసగుసలాడుకున్న సందర్భాలు అనేకం. ఈ నేపథ్యంలో తను చెప్పిన మాటలను నమ్మి మండల పరిషత్ అధికారులు నిబంధనలకు తూట్లు పొడుస్తూ తన భార్య పేరుతో ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశారు.



### కులంతోడై కలిసొస్తున్న కాలం...

మండలంలోని కొందరు మాజీ ప్రజాప్రతినిధులు అధికారులు మన వాడే అంటూ అతిగా చనువు ఇవ్వడంతో దాన్ని ఆసరాగా చేసుకున్న భాస్కర్ వారి సహకారాన్ని సంపూర్ణంగా తీసుకొని ఇందిరమ్మ ఇల్లు మంజూరుకు బాటలు వేశాడు. కూసుమంచిలో పుట్టి పెరిగి అనేక దశాబ్దాలుగా నివాసం ఉంటున్న నిరుపేదలకు కులం రాజకీయం కలిసి రాక ఇందిరమ్మ ఇల్లుకు దూరమైతున్నారు.

### ఎంపిడిఒ కోట అంటూ ప్రచారం....

ఇటీవల కూసుమంచి గ్రామానికి చెందిన అనేక మంది ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి అర్హత కలిగిన నిరుపేదలు స్థానిక క్యాంపు కార్యాలయానికి సైతం వెళ్లి క్యాంపు కార్యాలయానికి సైతం వెళ్లి క్యాంపు కార్యాలయ ఇన్చార్జి ముందు తమ ఆవేదనను వ్యక్త పరిచారు. దానిలో భాగంగా భాస్కర్ ఇంటి నిర్మాణం గురించి ప్రశ్నించగా పూర్తి వివరాలు తెలుసుకుంటామని క్యాంపు కార్యవర్గాలు తెలుపగా బయటకు వచ్చిన అర్హులకు నాది ఎంపీడీవో కోటాలో వచ్చింది అంటూ భాస్కర్ తనకు తానే ప్రచారం చేసుకోవడం మొదలు పెట్టాడు. ఏ అధికారికి కూడా ప్రత్యేక కోట లేకపోవడంతో అతడు వక్రమార్గంలో ఇల్లు పొందాడని స్థానిక ప్రజలకు అర్థమవుతుంది. కావున పూర్తి విచారణ చేపట్టి వక్రమార్గంలో అక్రమంగా ఇల్లు పొందిన సదరు వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని ఇందిరమ్మ ఇంటి నిర్మాణ అర్హులు కోరుతున్నారు.

### పంచాయతీ కార్యదర్శి నీరజా వివరణ....

గత పది సంవత్సరాలుగా కూసుమంచిలో ఉంటున్నాడు. ఇతనికి ఇల్లు లేదని భావించి మాత్రమే ఇందిరమ్మ ఇల్లు ఇవ్వడం జరిగింది, కానీ అతనికి ఇంతకు ముందు ఇల్లు ఉన్న విషయం మాకు తెలియదు. అయితే మేము ఆయన ఎక్కడో ఉన్నాడని ఊరు ఊరు తిరిగి తెలుసుకోలేము. హైదరాబాద్‌లో ఇల్లు ఉంటేనో లేదా మరో చోట ఉంటే అక్కడికి వెళ్లి మీకు ఇల్లు ఉందా లేదా ఆస్తి ఉందా, ఉద్యోగం ఉందా అని చూడటం కుదరదు కదా అంటూ వివరణ ఇవ్వడం తన ఉద్యోగ బాధ్యతలు ఎంత భాద్యతాయుతంగా నిర్వహిస్తుందో కూసుమంచి గ్రామ ప్రజలకు అర్థమవుతుంది.

# ఆశాలు ప్రతిరోజు 'ఫ్రైడే డ్రైడే' నిర్వహించాలి

**డిఎంఅండ్‌హెచ్‌వో కళావతి బాయి**

**ప్రజాపక్షం/చింతకాని :** ఆశా కార్యకర్తలు ప్రతిరోజు ఫ్రైడే డ్రైడే నిర్వహించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కళావతి బాయి సూచించారు.మంగళవారం ఆమె చింతకాని మండల నాగులవంచ, రేపల్లెవాడ, చింతకాని గ్రామాల్లో పర్యటించారు. ఈసందర్భంగా ఆమె గ్రామల్లో సీజనల్ వ్యాదులపై క్షుణ్ణంగా అడిగి తెలుసుకున్నారు. వర్షాలు అధికంగా కురుస్తున్న నేపథ్యంలో గ్రామల్లోని కాలువల్లో లార్వాని వెంటనే తొలగించి థీమోపాస్ స్ప్రే చేయించాలన్నారు. కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు సూచించారు. జ్వరాలు వస్తే అశ్రద్ధ చేయకుండా ఆరోగ్య కార్యకర్త వద్దకు వెళ్లి పరిక్షలు చేయాంపకోవాలన్నారు.అనంతరం చింతకాని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి ఆసుపత్రికి వచ్చే జ్వరపీడితులకు వెంటనే రక్త పరిక్షలు జరిగి తగు చికిత్స అందిచా



లన్నారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ ఆల్తాఫ్, వేణు మాధవ్, సిహెచ్‌ఓ వీరేందర్, సూపర్‌వైజర్లు కృష్ణారావు, పంచాయతీ కార్యదర్శులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పేద విద్యార్థికి ఆర్థిక చేయూత

**ప్రజాపక్షం/వైరాః** స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మండపం నందు ఆర్యవైశ్య మహాసభ మండల అధ్యక్షులు మిట్టపల్లి కిరణ్‌కుమార్ అధ్యోతన కొణతాలపల్లి వెంకటసుబ్బారావు, కోటేశ్వరి దంపతులు ప్రథమ కుమారుడు కొణతాలపల్లి



వెంకటదినేష్, అనుపమ దంపతుల కుమారుడు రేయాన్స్ జన్మదిన సందర్భంగా ఆర్యవైశ్య నిరుపేద విద్యార్థికి రూ.20వేలు ఆర్థిక సహాయాన్ని వనమా విశ్వేశ్వరరావు చేతుల మీదుగా అందజేశారు. వెంకటసుబ్బారావు రూ.5వేలు, కొప్పురావూరి రఘువీర్ రూ.1500లు, వజినేపల్లి ప్రవీణ్ రూ.2వేలు, ఇతరులు రూ.10వేలు మొత్తం రూ.20వేలు, అలాగే రాయల నారాయణరావు, విజయలక్ష్మి దంపతుల కుమారుడు డాక్టర్స్ మెడికల్ అకాడమీ ఫౌండర్ రాయల సతీష్‌బాబు జన్మదినం సందర్భంగా వారిని శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రాయల సతీష్‌బాబు మాట్లాడుతూ తనవంతు సహాయ సహకారాలు అందజేయడానికి ముందుకు వచ్చిన రాయల సతీష్‌బాబుని వైరా పట్టణ ఆర్యవైశ్య ప్రముఖులు అభినందించారు. ఈ కార్యక్రమంలో వైరా వర్తక సంఘం అధ్యక్షులు, ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర నాయకులు వనమా విశ్వేశ్వరరావు, డాక్టర్ పెరుమాళ్ళ కృష్ణమూర్తి, కొప్పురావూరి వెంకటేశ్వరరావు, నూకల శ్రీనివాసరావు, మిట్టపల్లి సత్యంబాబు, కాటేపల్లి రామకృష్ణ, రంగా సింహాద్రి, కొల్లా వెంకట రాంబాబు, యంద్రపూడి శివశంకర్, కొప్పురావూరి శబరినాథ్, కొప్పురావూరి రఘువీర్, వజినేపల్లి రవి, మిట్టపల్లి విజయ్‌కుమార్, కొణతాలపల్లి వెంకటసుజిత్, రాయల అన్నపూర్ణ, నూకల అన్నపూర్ణ, రాయల విజయలక్ష్మి , రాయల లలిత, గజ్జల మాణిక్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

# సురేష్ మృతి సిపిఐకి తీరని లోటు

**సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి**



**ప్రజాపక్షం/చింతకాని :** సురేష్ మృతి సీపీఐ కి తీరని లోటని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి పేర్కొన్నారు. చింతకాని మండలం కోమట్లగూడెం గ్రామానికి చెందిన సీపీఐ నాయకులు బత్తుల సీతారాములు కుమారుడు బత్తుల సురేష్(28) గుండెపోటుతో మరణించాడు. విషయం తెలుసుకున్న జమ్ముల జితేందర్‌రెడ్డి కోమట్లగూడెం లో సురేష్ మృతదేహంపై పార్టీ జెండా ఉంచి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జమ్ముల మాట్లాడుతూ సురేష్ పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనే వాడని సురేష్ మృతి కుటుంబానికి తీరని లోటని సురేష్ కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందన్నారు. నివాలులర్పించిన వారిలో జిల్లా కార్యవర్గ సభ్యులు ఏపూరి రవీంద్రబాబు, సీపీఐ మండల కార్యదర్శి దూసరి గోపాలరావు, నాయకులు వేముల జానకి రాములు, శాఖా కార్యదర్శి అవులూరి రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పేదోడి ఇంటికల నిజం చేస్తున్నాం...



**ప్రజాపక్షం/చింతకాని:** ఇందిరమ్మ రాజ్యంలో ప్రతి పేదవాడి ఇంటికల నిజం చేస్తున్నామని డిప్యూటీ సీఎం సతీమణీ,అమ్మా ఫౌండేషన్ చైర్మన్ మల్లు నందిని విక్రమార్క పేర్కొన్నారు. మంగళవారం చింతకాని మండలం నాగులవంచ గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పదేళ్ల బారాస పాలనలో ఇండ్ల కోసం వేచిచూసిన పేదవాళ్ల కల కాంగ్రెస్ ప్రభుత్వంలో సాకారం కానుందని అన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో చుంచు శ్రీనివాసరావు, తహసీల్దార్ కరుణాకర్‌రెడ్డి ,జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అంబటి వెంకటేశ్వర్లు, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆర్‌కే , నాయ కులు భాస్కర్, గోపీ, నాగార్జున, బొర్రా ప్రసాద్, ఓర్సు వీరభద్రం, పూర్ణయ్య, కాండ్ర పిచ్చయ్య, నల్లమోతు శేషగిరిరావు, ఆలస్యం బసవయ్య, అంబటి శాంతయ్య పాల్గొన్నారు.

# రేషన్‌కార్డులు పంపిణీ



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** లబ్దిదారులకు మంజూరైన రేషన్‌కార్డులను 15వ డివిజన్ కార్పొరేటర్ రావూరి కరుణ పంపిణీ చేశారు. మంగళవారం డివిజన్ పరిధిలోని అల్లిపురంలో జరిగిన కార్యక్రమంలో 22 మంది లబ్దిదారులకు నూతనంగా మంజూరైన రేషన్‌కార్డులను, ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ. 1.50 లక్షల విలువ గల చెక్కులను లబ్దిదారులకు కార్పొరేటర్ రావూరి కరుణ పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ది చేకూరుస్తున్నట్లు తెలిపారు. నూతన రేషన్ కార్డులతో పాటు పలువురికి చేర్పులు, మార్పులకు సంబంధించి మంజూరైన కార్డులను పంపిణీ చేసినట్లు ఆమె తెలిపారు. అనారోగ్య కారణాలతో చికిత్సలు పొంది ఆర్థిక చేయూత కోసం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సిఫార్సుతో ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా లబ్ది చేకూరుస్తున్నట్లు తెలిపారు.కార్యక్రమంలో రేషన్ డీలర్ రావూరి రాంబాబు, లబ్దిదారులు పాల్గొన్నారు.

# మంజూరైన చెక్కును ఇవ్వలేదని డిఆర్‌ఒకు వినతి

**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన చెక్కును ఇవ్వలేదని డిఆర్‌వో ఎ. పద్మశ్రీకి రాంక్యాతండా గ్రామానికి చెందిన జాటోత్ లచ్చు డిఆర్‌వో ఎ. పద్మశ్రీకి వినతి పత్రం మంగళవారం సమర్పించారు. ఈ సందర్భంగా లచ్చు మాట్లాడుతూ తన ఆరోగ్యం బాగా లేక మొకాళ్ల సర్జరీ చేయించుకున్నాడు. దీనికి సుమారు నాలుగు లక్షలు ఖర్చు అయిందని 2024 ఆగస్టులో ముఖ్యమంత్రి సహాయ నిధి కోసం మంత్రి క్యాంపు కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నట్లు ఆయన తెలిపారు. గ్రామానికి చెందిన తేజావత్ వెంకన్నను పలుమార్లు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కు గురించి అడిగినా రాలేదంటూ సమాధానం దాటవేశారన్నారు. ఇటీవల హైదరాబాద్‌లోని సచివాలయంకు వెళ్లి పరిహారం గురించి అడుగగా ఈ ఏడాది మార్చి 21న రూ. 60 వేలు చెక్కు మంజూరైందని తెలిపారని లచ్చు తెలిపారు. ఖమ్మంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో దీనికి సంబంధించి అడుగగా గ్రామానికి చెందిన తేజావత్ వెంకన్న ఆ చెక్కు తీసుకున్నాడని తెలిపినట్లు డిఆర్‌వోకు వివరించారు. తనతో పాటు పలువురిని పథకాలకు సంబంధించి వెంకన్న తీవ్ర ఇబ్బందులు పెడుతున్నాడని వినతి పత్రంలో తెలిపారు. తనకు మంజూరైన చెక్కును ఇప్పటి వరకు ఇవ్వకపోవడంతో ఆ చెక్కు గడువు తీరిందని తనకు న్యాయం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో జాటోత్ బావ్‌సింగ్, దరావత్ తారాచంద్, లక్ష్మ ణ్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా మంత్రి క్యాంపు కార్యాలయంకు వెళ్లి అక్కడి అధికారులను లచ్చు చెక్కుకు సంబంధించి అడుగగా తేజావత్ వెంకన్నను పిలిపించి మంజూరైన చెక్కును ఇప్పించినట్లు సమాచారం.

# భూపాల్‌లో ఖమ్మం విద్యార్థి మృతి

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని భూపాల్‌లో ఖమ్మం నగరానికి చెందిన విద్యార్థి మృతి చెందిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే... ఖమ్మం నగరంలోని 10వ డివిజన్ చైతన్య నగర్‌లో నివసించే ఊటుకూరి రామారావు, దుర్గాభవాని ల కుమారుడు హేమంత్‌కుమార్ (20), కుమార్తె ప్రణవి లు ఉన్నారు. హేమంత్‌కుమార్ మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని భూపాల్‌లోని విఐటిలో ఇంజనీరింగ్ మూడవ సంవత్సరం చదువుతున్నాడు. ఆదివారం హేమంత్ కుమార్‌తో పాటు ముగ్గురు స్నేహితులతో కలిసి భూ పాల్‌లోని బీచ్‌కు వెళ్లారు. ప్రమాదవశాత్తు బీచ్‌లో నలుగురు విద్యార్థులు గల్లంతు కాగా వారిలో ఇద్దరు క్షేమంగా బయటపడ్డారు. హేమంత్‌కుమార్ తో పాటు మరో విద్యార్థి మృతిచెందాడు. హేమంత్‌కుమార్ తల్లి దుర్గాభవాని కారేపల్లిలోని మైనార్టీ గురుకుల పాఠశాలలో అధ్యాపకురాలిగా పని చేస్తున్నారు. హేమంత్‌కుమార్ మృతితో కుటుంబ సభ్యులు, బంధువులు శోక సంద్రంలో మునిగిపోయారు. హేమంత్ కుమార్ భౌతికాయాన్ని భూపాల్ నుంచి దమ్మపేట మండలం నాగుపల్లి గ్రామమైన వారి అమ్మమ్మ గారి స్వగృహంకు తరలించి అంత్యక్రియలు నిర్వహించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.